# పొలం పిలుస్తుంది



**నంద్యాల,జులై21.అక్షర టైమ్స్:-** 21వ తేదీన నంద్యాల మండలంలోని కొత్తపల్లి మరియు బిల్లలాపురం గ్రామాలలో నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడమైనది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఖరీఫ్ కాలంలో సాగు చేసిన పంటలకు భీమా చేయించుకోవాలని తెలియజేశారు. ఈ ఖరీఫ్ కాలంలో సాగు చేసిన పంటలకు ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ భీమా ను వివిధ పంటలకు వర్తింప చేస్తూ మార్గదర్శకాలు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా పథకం లో వరి గ్రామం యూనిట్ గా, మొక్కజొన్న, మినుము, కంది, మిరప మండలం యూనిట్ గా, సజ్జ, కొర్ర, ఉల్లి, ఆముదం, జొన్న జిల్లా యూనిట్ గా ఉన్నదని, వరికి ఎకరాకు 800/-, మొక్కజొన్న కు 660/-, కంది కి 400/- , మినుము మరియు జొన్నకు 190/-, సజ్జ మరియు ఆముదం పంటలకు 160/-, ఉల్లికి 450/- , మిరపకు 2880/- ప్రీమియం చెల్లించి రైతులు పంటల భీమా పథకం లో నమోదు చేసుకోవచ్చునని, అలాగే, వరికి ఆగస్టు 15వ తేదీ వరకు మరియు ఇతర పంటలకు జూలై 31 వరకు గడువు ఉన్నదని తెలిపారు. ఇంకా పూర్తి వివరాలకు రైతులు వారి సమీపంలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని కలవాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో పంటల బీమా పథకం రైతులకు ఎంతో మేలు చేస్తుందని , కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి సూచించారు.అలాగే ప్రస్తుతం ఎల్లినో ప్రభావం వలన వర్షాలు తక్కువగా కురుస్తున్నందున ఈ పరిస్థితుల్లో రైతులు వరి, మొక్కజొన్న కు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలను అనగా మినుము లేదా కంది లేదా పెసలు ఎంపిక చేసుకొని సాగు చేసుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది సురేష్ ఆయా గ్రామ రైతులు పాల్గొనటం జరిగినది.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

# దస్తావేజులపై దెబ్బ జీవనోపాధిపై భారం

**జీవో 369 రద్దు చేయాలి..**
**స్టాంప్స్&రిజిస్ట్రేషన్ శాఖలో పీపీపీపై తీవ్ర వ్యతిరేకత**
**రాష్ట్రవ్యాప్తంగా పెన్‌డౌన్ నిరసనలు ఉధృతం..**
**ప్రైవేటీకరణ పేరిట కుదేలవుతున్న ఉపాధి**
**డిమాండ్లు నెరవేరకపోతే ఉద్యమం మరింత ఉధృతం**



**ఎమ్మిగనూరు,జూలై21.అక్షర టైమ్స్:-** రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో సంస్కరణల పేరుతో తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు ప్రజల జీవనోపాధిపై ఎంతటి ప్రభావం చూపుతున్నాయో గమనించాల్సిన అవసరం ఉంది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని ప్రవేశపెట్టే ప్రయత్నం, దానికి సంబంధించిన జీవో నెం.369పై వస్తున్న వ్యతిరేకత ప్రాధాన్యత సంతరించుకుంటుంది. ఈ నేపథ్యంలో దస్తావేజు లేఖరుల జీవనోపాధిని దూరం చేసే రాష్ట్ర ప్రభుత్వ జీవో నెం.396ను తక్షణమే రద్దు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) డిమాండ్ చేసింది. బుధవారం నాడు ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో దస్తావేజు లేఖరులు చేపట్టిన నిరసనలో భాగంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ కార్యదర్శి జి రంగన్న, సిపిఐ సీనియర్ నాయకులు భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని అమలు చేయాలనే ప్రభుత్వ నిర్ణయం వేలాది మంది దస్తావేజు లేఖరుల ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు సులభంగా, పారదర్శకంగా సేవలు అందించాల్సిన ప్రభుత్వ శాఖలను క్రమంగా ప్రైవేటీకరణ వైపు నడిపించడం సరైన విధానం కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ఈ వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న దస్తావేజు లేఖరుల కుటుంబాల జీవనోపాధిని ప్రమాదంలోకి నెట్టే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని అలాగే దస్తావేజు లేఖరులతో పాటు సహాయకులు,డిటిపి ఆపరేటర్లు, జిరాక్స్ సెంటర్లు, స్టాంపు వెల్డర్లు, టీ కొట్టు వారు మరియు వారి కుటుంబాలు మొత్తం రోడ్డున పడే పరిస్థితి కూటమి ప్రభుత్వం తీసుకురావడం చాలా దుర్మార్గమని వారు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జీవో నెం.369ను రద్దు చేసి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో పీపీపీ విధానాన్ని పూర్తిగా విరమించుకోవాలని సిపిఐ డిమాండ్ చేసింది. దస్తావేజు లేఖరుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించింది. ప్రజల ప్రయోజనాలను, ఉద్యోగుల జీవనోపాధిని కాపాడే విధంగా ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వీరేష్, మల్లికార్జున, గౌడ్ నరసింహులు, నాగరాజు, శాంతప్ప మరియు తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వం తీసుకుంటున్న ప్రైవేటీకరణ నిర్ణయాలు ఒకవైపు సేవల వేగాన్ని పెంచే ప్రయత్నంగా కనిపించినా, మరోవైపు సంప్రదాయ వృత్తులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. మరీ "అభివృద్ధి మరియు ఉపాధి" మధ్య జరుగుతున్న ఈ పోరులో ప్రభుత్వం ఏ దిశగా అడుగులు వేస్తుందో వేచి చూడాలి.

# కూటమి ప్రభుత్వంలో మహిళలపై జరుగుతున్న దాడులు ఆపాలని డిమాండ్ చేస్తూ..నిరసన వ్యక్తం చేసిన వైసీపీ నేతలు





**నంద్యాల,జులై21.అక్షర టైమ్స్:-** మహిళపై రోజురోజుకూ పెరుగుతున్న ఆకృత్యాలకు అడ్డుకట్ట వేసేదెవరు..? చట్టాలు కేవలం కాగితాలకే పరిమితమా..?"అవును... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటిన నాటి నుంచి మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు, అత్యాచారాలు, దారుణ హత్యలు పరాకాష్టకు చేరాయని... పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు ఎవరికీ భద్రత లేకుండా పోయిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు!ఇది నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం సెంటర్! ఇక్కడ ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం సాక్షిగా వినతి పత్రం అందజేసి... అధికారంలో ఉన్న పాలకులు కళ్లు తెరవాలంటూ వైఎస్సార్సీపీ నేతలు గళమెత్తారు. ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, స్టేట్ మహిళ విభాగం జనరల్ సెక్రెటరీ శశికళ రెడ్డి, అసెంబ్లీ పరిశీలకుడు సూర్యనారాయణ రెడ్డి, జిల్లా జోనల్ మహిళ ఇన్చార్జి గాజుల శ్వేతా రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాతమ్మతో పాటు భారీగా తరలివచ్చిన మహిళా నేతలు నేడు పెద్ద ఎత్తున నిరసన గళం విప్పారు.ఎమ్మెల్సీ ఇషాక్ బాషా , మహిళా నేతలు మాట్లాడుతూ... "ఇటీవల గుంటూరులో ఏం జరిగింది..? బద్వేలులో ఏం జరిగింది..? కన్నతల్లి లాంటి ఆడపడుచులను దిగంబరంగా చేసి రోడ్డుపై అవమానించిన ఘటనలు చూస్తుంటే... ఇది నాగరిక సమాజమేనా అని గుండె తరుక్కుపోతుందని, సభ్యసమాజం తలదించుకునేలా దారుణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ హృదయ విదారక సంఘటనలు మన రాష్ట్ర ప్రతిష్టకే మాయని మచ్చగా మారాయని తీవ్రంగా విమర్శించారు. "అత్యంత దారుణమైన విషయమేమిటంటే... ఈ అఘాయిత్యాలకు ఒడిగడుతున్న నిందితుల వెనుక అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వస్తుంటే ఈ రాష్ట్రంలో మహిళలకు రక్షణ ఎక్కడుంది..? రాజకీయ ఒత్తిళ్లతో కేసులు నమోదు చేయడంలో జాప్యం చేస్తున్నారు. విచారణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికార బలంతో నేరస్థులను కాపాడుతుంటే బాధితులకు న్యాయం ఎలా జరుగుతుంది..?" "చట్టం ముందు అందరూ సమానమే అనే నమ్మకాన్ని ప్రజల్లో నిలబెట్టాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉంది! రాజకీయం వేరు... ఇంట్లో ఉండే ఆడపిల్లల భద్రత వేరు! పక్షపాతం లేకుండా, అధికార బలపరీక్షలు పక్కనబెట్టి నేరస్థులను కఠినంగా శిక్షించకపోతే... కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని వైకాపా నేతలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరుస్తుందో... లేక ఈ అఘాయిత్యాలను నిర్లక్ష్యం చేస్తూ పోతుందో చూడాలి!" ఈ కార్యక్రమంలో నంద్యాల అసెంబ్లీ అధ్యక్షురాలు హుస్సేనమ్మ, రాష్ట్ర మాజీ దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, మాజీ వైస్ ఎంపీపీ పార్వతమ్మ, బనగానపల్లె అసెంబ్లీ అధ్యక్షురాలు షాజహాన్, మాజీ కౌన్సిలర్స్ కన్నమ్మ, సావిత్రమ్మ, నంద్యాల ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్, మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు కారు రవికుమార్, వైసిపి నాయకుడు సాయిరాం రెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు టివి రమణ, స్టేట్ సెక్రటరీ మధుబాబు, స్టేట్ మైనార్టీ సెల్ సెక్రెటరీ ఇక్బాల్, స్టేట్ బీసీ సెల్ సెక్రటరీ నాగేంద్ర, స్టేట్ జనరల్ సెక్రెటరీ యూనిస్ బాష, నంద్యాల జిల్లా వైసీపీ సెక్రటరీ దేవనగర్ బాషా, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు సుమంత్ రెడ్డి, వైసీపీ జిల్లా యూత్ వింగ్ సెక్రటరీ గగ్గుటూరు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మేసా చంద్రశేఖర్, మరియు మహిళలు జిల్లా వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# గ్రామ దేవతలకు ఐదు రోజులు జలాభిషేకాలు వర్ణుడు కరుణించి కురిసిన వర్షం








**పంటల కోసం రైతన్నలు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు**
**ఆనవాయితీని కొనసాగించిన గ్రామస్తులు..**
**గ్రామదేవతలకు మొక్కులు తీర్చుకున్న భక్తులు**

**ఆదోని,జూలై21.అక్షర టైమ్స్:-** ఆదోని మండలం పెద్ద తుంబళంగ్రామంలో ఖరీఫ్ సీజన్లో తొలకరి వర్షాల అనంతరం రైతులు పత్తి, వేరుశనగ తదితర పంటలను సాగు చేశారు. విత్తనాలు నాటే సుమారు 50 రోజుల గడిచిన తగినంత వర్షపాతం లేకపోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. రైతులు ఎకరానికి 30 వేల నుంచి 40 వేల వరకు పెట్టుబడి పెట్టడంతో పంటలు పరిస్తితి పై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు కురవాలని గ్రామంలో ఆనవాయితీగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా గ్రామస్తులు నిర్వహించారు. గ్రామంలోని ఊరు బావిని శుభ్రపరచి, అందులోని నీటిని మోటార్ల ద్వారా బయటకు తొలగించారు. అనంతరం బావిలో ఊరిన తాజా నీటితో సుమారు 100 మంది యువకులు, పిల్లలు తో కలసి గ్రామదేవతలకు ఐదు రోజులపాటు వరుసగా శుభ సాయంకాలం సమయంలో జలాభిషేకాలు నిర్వహించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. జలాభిషేకాలు ప్రారంభమైన తొలి రోజే వర్ణుడు కరుణించి వర్షం కురవడంతో గ్రామస్తులు దీనిని శుభ సూచకంగా భావించారు. వర్షంతో పంటలు మళ్లీ పచ్చదనాన్ని సంతరించుకోవడం రైతుల్లో ఆశలు నింపింది. ఐదవ రోజైన మంగళవారం గ్రామదేవతలకు ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సంప్రదాయాన్ని గ్రామస్తులు వర్షం లేనప్పుడు విశ్వాసంతో కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు గౌస్ పీర్ ఆధ్వర్యంలో ఘనంగా మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు




**కడప నగరం,జూలై21.అక్షర టైమ్స్:-** కడప నగరంలోని ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ను ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్ అన్నారు.మంగళవారం నా మల్లికార్జున జన్మదిన వేడుకలను ఆయన ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కాంగ్రెస్ కార్యకర్తలకు మంచి పట్టారు. ఆ సందర్భంగా గౌస్ పీర్ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లాలో ఒక సాధారణ దళిత కుటుంబంలో మల్లికార్జున ఖ ర్గే జన్మించారని అయినా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా లోక్ స భ సభ్యులుగా ప్రస్తుతం రాజ్యసభ సభలో ప్రతిపక్ష నాయకుడిగా సేవలందిస్తున్నారని ఆయన గుర్తు చేశారు.ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ రాబోవు రోజులలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ అభిమానులు ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి తమ వంతుగా తమ అమూల్యమైన ఓట్లను వేసి కాబోయే ప్రధానిగా రాహుల్ గాంధీని చేసుకోవాల్సిన అవసరం ఎంత ఉందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో నగరా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అంజన్ కుమార్ క డివిజన్ ఇన్చార్జ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సౌధాగర్. సాదిక్ . మహబూబ్ భాషా. సిద్ధిక్. షేక్ కరీముల్లా. సర్దార్ భాష. సర్దార్ భాష. ఖాజాపీర్. మురాద్ భాష . సుబ్రహ్మణ్యం. తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పంద వ్యక్తులకు అద్దె ఇళ్లు ఇవ్వవద్దు: పోలీస్ హెచ్చరిక

**పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాతే అద్దెకు ఇళ్లుఇవ్వండి ఇళ్లు యాజమాన్యులకు: పోలీసు హెచ్చరిక**
**ప్రజల భద్రతే లక్ష్యం.. అద్దె ఇళ్లుయజమానులు పోలీసుల మార్గదర్శాలు పాటించాలి**



**ఆదోని,జూలై21.అక్షర టైమ్స్:-** ఆదోని పట్టణంలో ఇళ్లు, గదులు అద్దెకు ఇచ్చే యజమానులు అప్రమత్తంగా ఉండాలని టూ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి సూచించారు. అద్దెకు వచ్చే వ్యక్తుల పూర్తి వివరాలు నిర్ధారించుకున్న తర్వాతే ఇల్లు లేదా గదిని అద్దెకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అద్దెదారుల పేరు, స్వస్థలం, వృత్తి, ఆధార్ లేదా ఇతర గుర్తింపు పత్రాల వివరాలు, మొబైల్ నంబర్, శాశ్వత చిరునామా వంటి సమాచారాన్ని తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే అద్దె ఒప్పందం (రెంట్ అగ్రిమెంట్)ను లిఖితపూర్వకంగా చేసుకుని, వారికి పరిచయం ఉన్న వ్యక్తుల వివరాలు, సంతకాలు కూడా తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రతి ఇంటి యజమాని పూర్తి విచారణ అనంతరమే అద్దెకు ఇవ్వాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని టూ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.

# మట్టి రోడ్డు సమస్యను పరిష్కరించాలి



**నందవరం,జూలై21.అక్షర టైమ్స్:-** మండలంలోని గురజాల గ్రామంలో పొలాలకు వెళ్లే మట్టి రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో తహసిల్దార్ అబ్దుల్ వాహబ్ కు రైతులు వినతిపత్రం సమర్పించారు. రైతులు మాట్లాడుతూ గ్రామంనుంచి టీ, సోమలగూడూర్ పొలాలకు వెళ్లే మార్గంలో కొందరు రైతులు నాలుగుచోట్ల మట్టిరోడ్డును తవ్వి మూసివేశారని తెలిపారు. ఎరువులు తరలించడానికి, ఎడ్లబండ్లతో పొలంపనులకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేరే ప్రాంతంలో సమస్య ఉందనే నెపంతో రోడ్డు మూసివేయడం సరికాదన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు వెంటనే స్పందించి మూసివేసిన మట్టిరోడ్డును తెరిపించి,పునరుద్ధరించాలని కోరారు. రైతులు కె,రాముడు,పెద్దగుంటి రంగన్న పెద్ద పెద్దనారాయణ,మొహాను,ఈరన్న, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# ఇంకా అందని బ్యాగులు



**నందవరం, జూలై 21. అక్షర టైమ్స్:-** విద్యా సంవత్సరం మొదలై రెండు నెలలు కావస్తున్న నేటి వరకు విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, యూనిఫామ్ ను చంద్రబాబు సర్కార్ పంపిణీ చేయలేదు. దీంతో విద్యార్థులకు చినిగిపోయిన, జగనన్న ప్రభుత్వం ఇచ్చిన, సొంతంగా కొనుగోలు చేసిన బ్యాగులే దిక్కు య్యాయి. స్తోమత లేని విద్యార్థులు.. చినిగిన బ్యాగుల్లో పుస్తకాలను సర్దుకొని అవస్థతల నడుమ బడులకు వెళు తున్నారు.

# తల్లికి వందనం విధ్యార్థులకు వరం

**టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యాసిన్**



**వేంపల్లె, జూలై 21. అక్షర టైమ్స్:-**టిడిపి కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం విధ్యార్థులకు వరం వంటిదని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యాసిన్ సూచించారు. మంగళవారం యాసిన్ మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం చెప్పిన విధంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తోందన్నారు. తల్లికి వందనం ద్వారా ప్రతి ఏటా విధ్యార్థుల తల్లుల ఖాతాల్లో ఆర్థిక సహాయాన్ని జమ చేస్తోందని, వీటిని విధ్యార్థులు చక్కగా ఉపయోగించుకొని చదువులపై శ్రద్ధ చూపాలని కోరారు. అలాగే విద్యా రంగ అభివృద్ధికి మంత్రి నారా లోకేష్ కృషి ఎనలేనదని, తదితర విద్యా పథకాల అమలుతో విధ్యార్థుల చదువులకీ పూర్తి భరోసా కల్పిస్తున్నారన్నారు. ఈ ఆర్థిక ఏడాదికి రాష్ట్ర వ్యాప్తంగా 67,47,190 మంది విద్యార్థులకు రూ. 10,120 కోట్లకు పైగా ఈనెల 22 నుంచి తల్లికి వందనం కింద తల్లుల ఖాతాల్లో జమ అవుతాయని వెల్లడించారు.

